
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శుక్రవారం 14 నవంబరు 2025




సిరిసిల్ల జిల్లా అసుపత్రిలో బాధితులు (ఫైల్)

'భౌ' బోయ్

- దడ పుట్టిస్తున్న శునకాలు.. గుంపులుగా దాడి..
- రాత్రిళ్లు వాహనదారులను తరుముతున్న కుక్కలు
- జిల్లాలో పది నెలల్లో 4642 మంది బాధితులు
- బడి పిల్లల తల్లిదండ్రుల ఆందోళన

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి... భౌ..భౌమంటూ జనాన్ని పరుగులు పెట్టిస్తున్నాయి. గుంపులు గుంపులుగా ప్రజలపై దాడి చేస్తుండటంతో వీధుల్లో కుక్కలను చూసి భయపడుతున్నారు. రాత్రుల్లో వాహనదారులను పరుగులు పెట్టిస్తున్నాయి. బస్‌స్టేషన్లు, మార్కెట్ ప్రాంతాల్లో చేతుల్లో బ్యాగులు ఉంటే లాకెళ్లుతున్నాయి. జిల్లాలో గడిచిన పది నెలలు 4642 మంది కుక్క కాటుకు గురైన బాధితులు ఉన్నారు. జిల్లా కేంద్రంలో గత నెలలో గంట వ్యవధిలోనే ఒక కుక్క 40 మందిపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేసింది. జిల్లా కేంద్రంతో పాటు ఎల్లా రెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావు పేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, బోయిన్‌పల్లి, వేములవాడ, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి మండలాల్లో ప్రతిరోజు ఏదో ఒకచోట కుక్కల దాడుల సంఘటలు జరుగుతూనే ఉన్నాయి. గత సంవత్సరం ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన రాజ్యలక్ష్మి అనే వృద్ధురాలు కుక్కలు దాడిలో చనిపోయింది. తీవ్ర గాయాలతో మంచాన పట్టిన వారు ఉన్నారు. జిల్లాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు, జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు కుక్క కాటుకు గురవుతున్నారు. కుక్కలతో ప్రజలు బిక్కుబిక్కుమనే పరిస్థితి ఏర్పడింది. రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న కుక్క లను నియంత్రించాలని సుప్రీం కోర్టు తాజాగా ఇచ్చిన ఆదేశాల మేరకు వాటి కోసం షెడ్లు వేసి తరలించడానికి బల్దియా అధికారులుప్రణాళికలు రూపొందిస్తున్నారు. సుప్రీంకోర్టు మార్గ దర్శకాల ప్రకారం వీధి కుక్కలకు రేబీస్ టీకాలు, సంతాన నియం త్రణ ఆపరేషన్లు చేయడానికి గత సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ భారీగానే ఖర్చు పెట్టింది. గతంలో వెయ్యి కుక్కలకు వ్యాక్సినేషన్, శస్త్ర చికిత్సలకు రూ 16 లక్షలు ఖర్చు చేశారు. గత సంవత్సరం రూ ఒక్కో కుక్కకు రూ.1650 చొప్పున రూ.16.50 లక్షలు జనరల్ నిధుల నుంచి మంజూరీ ఇచ్చింది.

జిల్లాలో నెలల వారీగా కుక్కకాటు బాధితులు

మాసం	బాధితులు
జనవరి	829
ఫిబ్రవరి	494
మార్చి	498
ఏప్రిల్	444
మే	398
జూన్	342
జూలై	406
ఆగస్టు	372
సెప్టెంబరు	396
అక్టోబరు	463
మొత్తం	4642

● తల్లిదండ్రుల్లో భయాందోళనలు..

జిల్లాలో ప్రధానంగా వీధి కుక్కలు చిన్నారులపై దాడి చేస్తుండడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. పాఠశాలకు సైకిళ్లపై, నడుచుకుంటూ వస్తున్న కుక్కలు గుంపులుగా దాడి చేస్తున్న సంఘటనలు ఉన్నాయి. ఒంటరిగా పిల్లలను పంపించడానికే భయపడుతున్నారు. మరోవైపు రాత్రి వేళల్లో వివిధ పనుల నిమిత్తం వెళ్లి వచ్చేవారు కూడా భయపడుతున్నారు.

● రేబీస్‌పై అప్రమత్తంగా ఉండాలి..

బుల్లెట్ అకారంలో ఉండే రాబ్డీడో అనే వైరస్ వైద్య పరిభాషలో రేబీస్‌గా పిలుస్తాం. పెంపుడు జంతువుల ద్వారా వచ్చే రేబీస్ మనకు ప్రధానంగా కుక్క కాటు ద్వారా వస్తోంది. రేబీస్ ఉన్న కుక్క కరవకపోయినా, ప్రాణాంతకంగా మారే సంఘటనలు ఉన్నాయి. గోళ్లతో గీరినా, రక్కినా, పండ్లు గీచుకుపోయినా, అంతకుముందు ఉన్న గాయాల మీద నాకినా, తినే అహారంలో మూతి పెట్టినా, చొంగ కార్చినా, పిల్లలు అటవస్తువులను ముందుగా కుక్క నాకి ఉంటే వాటిని పిల్లలు నోట్లో పెట్టుకోవడం వల్ల రేబీస్ వ్యాధి రావడానికి మార్గాలుగా ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రేబీస్ వ్యాధి ఎక్కువ శాతం పిచ్చికుక్క కరవడం ద్వారా సోకుతుంది. కుక్క కరవగానే నరాల ద్వారా వేగంగా మెదడుకు చేరి వ్యాధిని కలిగిస్తుంది. కుక్క కరిచిన తొమ్మిది రోజుల నుంచి కొన్ని నెలల్లోపు

(మిగతా 8వ పేజీలో)

● మాంసం వ్యర్థాలకు అలవాటుపడి...

జిల్లాలో చికెన్, మటన్, దుకాణాల వద్ద మాంసం వ్యర్థాలకు అలవాటు పడిన కుక్కలు క్రూరంగా దాడి చేస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా రోడ్లపై కూడా వ్యర్థాలు ఎక్కువగా పడేయడంతో కుక్కలువాటికి అలవాటు పడి జన వాసాల మధ్య తిరుగుతూ దాడులు చేస్తున్నా యని తెలుస్తోంది. రోడ్లపై సంచులతో వెళ్తున్న వారిపై దాడి చేసి వాటిని లాగుతున్నాయి. గ్రామాల్లో మేకలు, గొర్రెల మందలపై దాడులు చేస్తూ పీక్కుతిం టున్నా యి. గ్రామాల్లో మందలపై దాడిచేయడం వల్ల వం దల సంఖ్యలోనే చనిపోయిన సంఘటనలు ఉన్నాయి.

ధ్వంసమైన రహదారి.. పట్టించుకునేదెవరు..?


ప్రమాదకరంగా మారిన రోడ్డు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సత్సంగ సదనం నుంచి కోరుట్లపేట గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రెపై ఉన్న సీసీ రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైంది. ఓవైపు పూర్తిగా కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ధ్వంసమైన రహదారిని పట్టించుకోకుంటే ప్రమాదాలు తప్పవని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ధ్వంసమైన సీసీ రోడ్డుకు మరమ్మతు చేయడంతో పాటు ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

పోక్సో కోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

వేములవాడ టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఫాస్ట్ ట్రాక్, పోక్సో కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది బాధ్యతలు చేపట్టిన రాధిక జైస్వాల్‌ను గురువారం వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ఉపాధ్యక్షులు కట్కం జనార్ధన్, జాయింట్ సెక్రెటరీ నాగుల సంపత్‌కుమార్, క్రీడల కార్యదర్శి గుజ్జె మనోహర్, ట్రెజరర్ బొజ్జ మహేందర్, మహిళా ప్రతినిధి జక్కుల పద్మ, కార్యవర్గ సభ్యులు తమ్మిరి అన్నపూర్ణ, రాజశేఖర్, గుడిపల్లి మహేష్‌లు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు


వివాహ వేడుకకు హాజరైన బండి సంజయ్‌కుమార్

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ తనయుడి వివాహానికి గురువారం పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, విప్ ఆది శ్రీనివాస్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ నేత చల్మెడ లక్ష్మీనర్సింహారావు, బీజేపీ నేత వికాస్‌రావు తదిత రులు ఉన్నారు.

ఎనగల్ గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

చందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎనగల్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నికితరెడ్డి గురువారం సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విధుల్లో భాగంగా మారుపాక నర్సవ్వకు సంబంధించిన భూమి విరాసత్ పెట్టుకోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరిపారు. వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మహేం దర్, శ్రీనివాస్ ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


వివరాలను తెలుసుకుంటున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పెంచలయ్య

ఎల్లారెడ్డిపేట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పెంచలయ్య అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు పట్టిక, రోగుల వివరాలు, పరీక్షలు, మందుల నిల్వలను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి సేవలు ఎలా అందుతున్నాయో..? తెలుసుకున్నారు. రోగులకు ఆధునాతన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగిలా వైద్య సేవలందిచాలన్నారు. వెంట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రఘు, వైద్యులు బాబు, ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణప్రసాద్

గంభీరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం టీఆర్‌టీఎఫ్ మండల శాఖ సమావేశానికి కృష్ణప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు, మెడికల్ బిల్స్ ఇతరత్రా ఏరియర్స్ బిల్స్ విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, టీఆర్‌టీఎఫ్ నాయకులు విశ్వనాథుల ప్రసాద్, ముత్తయ్యగారి నాగరాజు, చిట్టంపల్లి బాలకిషన్, శనిగరం రామచంద్రం, గంద్యాడపు శ్రీనివాస్, బానోత్ వర్షున్, బాలరాజు, సంధ్యారాణి, నజీమాబేగం, కొముకయ్య, రమేష్, ప్రవీన్‌కుమార్, భరత్, సురేందర్, వినయ్, విష్ణు, సుల్తాన్‌రాజు, రాధాకిషన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, రాములు, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

అందమైన చేతిరాతతో ఆత్మవిశ్వాసం పెంపు..

ఇల్లంతకుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అందమైన చేతిరాత ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కాలిగ్రాఫర్ దిడ్డి సతీష్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఇంగ్లీష్ కాలిగ్రఫీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాల అధ్యయనం ఎంత ముఖ్యమో అందమైన చేతిరాత కూడా అంతే ప్రధానమన్నారు. పరీక్షలలో సమాధానాలు రాస్తున్నప్పుడు అందమైన చేతిరాత ఉన్నవారు అదనపు ప్రయోజనాన్ని పొందుతారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు పెన్‌హోల్డింగ్ మెళుకువలు, స్పేసింగ్, స్ట్రోక్స్ ప్రాధాన్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపకులు శ్రీనివాస్, నయిమొద్దీన్, మల్లారెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, జీవన్, శంకర్, మమత, రాజశేఖర్, దేవరాజ్, కిషోర్, లింగమూర్తి, రమేష్, యాదగిరిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని జిల్లాగా నిలపాలి

- గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి - రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు చందన

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 13 ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు లేని జిల్లాగా నిలిపేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన కోరారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు చందన సమీక్షా సమావేశం నిర్వహించారు. మిషన్ వాత్సల్యలో భాగంగా బాల్యవివాహాలు, బాల కార్మికుల కేసులు, వారి హక్కుల పరిరక్షణ తీసుకుంటున్న చర్యలు, వివిధ అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన మాట్లాడారు. బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిదేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. బాల కార్మికులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారిని సమీప విద్యాలయాల్లో చేర్పించాలని, అనాథ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లలను రెసిడెన్షియల్ స్కూళ్లలో జాయిన్ చేయాలని సూచించారు. విద్యాలయాలు, హాస్టల్‌లలో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై, హెల్ప్‌లైన్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులను విద్య ద్వారా సామాజికంగా, ఆర్థికంగా రాణించేలా తీర్చి దిద్దాలని సూచించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందించాలని, సేవలపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని, చిల్డ్రన్‌హోం పనులు పూర్తి చేయిస్తామని, పిల్లల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ అంజయ్య, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీవీహెచ్‌వో రవీందర్‌రెడ్డి, డీఈవో వినోద్ కుమార్, డీఎసీం చంద్రశేఖర్‌రెడ్డి, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, జీసీడీవో పద్మజ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు చందన

రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న రైస్‌మిల్లర్లపై కలెక్టర్ చర్యలు తీసుకుని రైతాంగానికి సహకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐకేపీ సెంటర్‌లల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని కోరారు. రైస్‌మిల్లర్లు రైతుల వద్ద నుంచి ప్రతి సంచికి రెండునుంచి మూడు కిలోలు అదనంగా ధాన్యం తీసుకుంటూ దోపిడీకి గురిచేస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత సీజన్‌లో సేకరించిన సన్నబియ్యానికి బోనస్ ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అందించాలని అలాగే ధాన్యం కొనుగోలు అలస్యం వల్ల రైతులు వర్షాల భయంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ప్రైవేటు వ్యాపారుల తేమ పేరుతో ఒక క్వింటాల్‌కు 8కిలోల వరకు కోతలు విధిస్తూ రైతులను నిలువునా దోపిడీ గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి మోసగాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైస్‌మిల్లర్ల లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జివ్వాజి విమల, కోడం రమణ తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ కొనుగోలు వరకు రైతులకు అండగా..

- ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి - రైతు పథకాలకు రూ లక్ష కోట్లకు పైగా వ్యయం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

సిరిసిల్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులు, చివరి ధాన్యం గింజ కొనుగోలు వరకు రైతులకు అధికారులు అండగా ఉండాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ఖరీఫ్ సీజన్-2025-26 వరి, పత్తి, మక్కల కొనుగోళ్లపై గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ అధికారులు అంచవేశారని, దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఐకేపీ 156, పీఏసీఎస్ 72, డీసీఎంఎస్ ఒకటి, మెప్మా ఆధ్వర్యంలో 7 కేంద్రాలతో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, సీసీఐ ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాలు, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మక్కల కొనుగోలుకు రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం, 17 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులకు అండగా నిలుస్తుందని, వారి సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. 20 నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ లక్ష కోట్లకు పైగా రైతు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులు వెచ్చించిందని వెల్లడించారు. రూ 20వేల కోట్లకు పైగా రుణమాఫీ రైతులకు చేసిందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకొని సహకరించాలని, ధాన్యం కొనుగోలు వివరాలు ఆన్‌లైన్ చేసి రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు.

లారీల కాంట్రాక్టర్లు తాము అగ్రిమెంట్ ప్రకారం వాహనాలు అందుబాటులో పెట్టి, రైతులకు ఇబ్బంది కాకుండా చూడాలని, రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సీఎంఆర్ ఇవ్వాలని, బ్యాంక్ గ్యారంటీ చెల్లించాలని సూచించారు. రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కౌలు రైతులు, ఇతర రైతుల వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి పంట ఉత్పత్తులు విక్రయించుకోవడంలో ఇబ్బందులు తొలగించాలని సూచించారు. పంటల నమోదు ఆన్‌లైన్ పక్కాగా చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీసీఎస్‌ఓ చంద్ర ప్రకాశ్ ఆయా శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భవానీనగర్‌లో సమస్యల తిష్ట..
- అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ
8

బీసీ రిజర్వేషన్లు చట్టపరంగా అమలు చేయాలి..
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు
8

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఫర్నీచర్ తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఫర్నీచర్‌ను అధికారులు తరలించడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇల్లంతకుంటలో 50పడకల ఆసుపత్రి మంజూరు కాగా ఇక్కడి ఆసుపత్రిని పెద్దలింగాపూర్ గ్రామానికి షిఫ్ట్‌చేశారు. గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని నిర్మాణాం చేపట్టి సంవత్సరం క్రితం ప్రారంభోత్సవం చేశారు. జిల్లాలోని గంభీరావుపేట మండలంలో నూతనంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మరో మూడు రోజుల్లో ప్రారంభోత్సవం చేసుకోవలసి ఉందని, అక్కడ ఫర్నీచర్ లేనందున పెద్దలింగాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఫర్నీచర్‌ను తాత్కాలికంగా తీసుకరావాలని ఉన్నతస్థాయి అధికారులు ఆదేశాలు జారీచేశారు. దీనితో వైద్యాధికారితో పాటు సిబ్బంది వచ్చి ఆసుపత్రిలోని బెడ్స్, ఐవీ స్టాండ్లు, ఆపరేషన్ థియేటర్‌లో పనికివచ్చే సామగ్రిని గురువారం వాహనంలో ఎక్కించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని వైద్యసిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఫర్నీచర్‌ను తీసుకొని వెళ్లి తిరిగి తీసుకవస్తామని పేర్కొన్నారు. దీనితో గ్రామస్థులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. ఫర్నీచర్ ఎక్కించిన వాహనాన్ని కదలిచ్చేది లేదని పేర్కొన్నారు. తమ ఆసుపత్రిలో ఉండవలసిన ఫర్నీచర్ ఇతర ప్రాంతాలకు ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. దీనితో అధికారులు ఫర్నీచర్ తరలింపును విరమించుకొని తిరిగి సామగ్రిని ఆసుపత్రిలో చేర్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్, నాయకులు గన్నారం నర్సయ్య, ఎద్దు కుమార్, ఎల్లవేని రమేష్, పసుల రాజు, కీర్తి ఎల్లయ్య, దర్శనం కొమురయ్యలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


ఈశ్వరయ్య(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని పద్మనగర్ బైపాస్ రోడ్డు జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం చింతకుంట రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న కొడిమ్యాల మండలం రాముని పల్లికి చెందిన గడ్డం ఈశ్వరయ్య(34) దుర్మరణం చెందాడు. పెయింట్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య ఉదయం 10 గంటల సమయంలో చింతకుంట నుంచి స్నేహితుడు చిరంజీవితో కలిసి కోతిరాంపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక నుంచి లారీ ఓవర్‌టేక్ చేస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఈశ్వరయ్య రోడ్డుపై పడగా అతని పైనుంచి లారీ వెళ్లటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. చిరంజీవికి కూడా గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సుల్తానాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి, గర్రెపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం రాత్రి రాజీవ్ రహదారిపై ప్రమాదం జరుగగా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో పెద్దపల్లి పట్టణం భూంనగర్‌కు చెందిన భాను విజయానంద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కుమారుడి వివాహ పత్రికలను బంధువులకు పంచడానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతుడు మంచిర్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి తీవ్రగాయాలు

రుద్రంగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి శివారులోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని టీఎస్ 23 టీ 4536 నంబర్‌గల ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పైన ఉన్న రుద్రంగికి చెందిన బీమనాతి మురళి అనే వ్యక్తితోపాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి తీవ్రగాయాలు కావడంతో వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం



- ఆన్‌లైన్‌లోనే విద్యుత్ బిల్లుల చెల్లింపులు
- క్యూలో నిలుచునే బాధ తప్పిందంటున్న వినియోగదారులు

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు చెల్లించేందుకు ఇది వరకు ఎన్‌పీడీసీఎల్ బిల్లుల కేంద్రాల వద్ద వినియోగదారులు బారులు తీరేవారు. గడువు తేదీ వస్తే ఒక్కోసారి గంటల తరబడి నిలుచుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పరిస్థితి మారింది. చాలా మంది డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యుత్ అధికారులు డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వినియోగదారుల సౌలభ్యం కోసం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) డిజిటల్ చెల్లింపుల విధానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి ఏటా 10 శాతం విద్యుత్ వినియోగదారులు తమ తమ నెల వారి విద్యుత్ బిల్లులను టీజీఎన్‌పీడీసీఎల్ యాప్, టి వ్యాలెట్, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. గత ఏడాది 2024 సంవత్సరంలో 10,93,689 వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపు చేయగా ఈ ఏడాది నవంబర్ 11 వరకు 14,66,588 మంది వినియోగదారులు చెల్లించారు.

● అవగాహన అవసరం..

నగరం, పట్టణాలు, మండల కేంద్రాల్లో చదువుకున్న వారు మాత్రమే డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య తక్కువగా ఉంది. ఆయా చోట్ల వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో డిజిటల్ చెల్లింపులు 30 శాతం కూడా దాటట్లేదు. బిల్లు జారీ చేసిన పదిహేను రోజుల్లో చెల్లించాలి. లేకపోతే 75 నుంచి 150 రూపాయల వరకు జరిమానా రూపంలో కట్టాల్సి ఉంటుంది. డిజిటల్ చెల్లింపులు చేస్తే చివరి తేదీపై నోటిఫికేషన్లు వస్తుంటాయి. కొన్ని ప్లాట్‌ఫారాల్లో ఆటో పే ఆప్షన్ కూడా ఉంది. కార్యాలయ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఎక్కడి నుంచైనా నిమి షాల వ్యవధిలో చెల్లించవచ్చు. చెల్లించిన తర్వాత వెంటనే లావాదేవీ నమోదవుతుంది.

ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు సులభం

- మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ



విద్యుత్ వినియోగదారులు తమ ఆంద్రాయిడ్ మొబైల్ ఫోన్‌లోని ప్లే స్టోర్ లో టీజీఎన్‌పీడీసీఎల్ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో విద్యుత్ బిల్లు పై ఉన్న యుఎస్సీ నంబర్ నమోదు చేసుకుని విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు. ఈ విధానంలో బిల్లు రాగానే నోటిఫికేషన్ వస్తుంది. టీజీఎన్‌పీడీసీఎల్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా బిల్లుల చెల్లింపును సులభతరం చేసింది. వినియోగదారులు బిల్లులను డిజిటల్ రూపంలో చెల్లించి సమాయాన్ని ఆదా చేసుకోవాలి.

పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలి

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం


ధర్మపోరాట దీక్షలో నినాదాలు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య అన్నారు. గురువారం బీసీ జేఏసీ నాయకుడు దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. మేమెంతో మాకంత వాటాలు కావాలని కోరారు.

కేంద్రంపై ఒత్తిడి చేసేందుకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే ఈ దీక్షతోపాటు ఈనెల 16న రన్ ఫర్ షోషల్ జస్టిస్, 18న ఎంపీలతో ములాకాత్, 23న అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. డిసెంబరు మొదటి వారంలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ఈదీక్షకు తెలంగాణ జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ సంఘీబావం తెలిపారు. ఈ దీక్షలో బీసీ జేఏసీ నాయకులు జీఎస్ ఆనంద్, దేవరకొండ సంతోషి లక్ష్మి, మంతెన కిరణ్, వాయిల రాజ్‌కుమార్, గుమ్మడి శ్రీనివాస్, అశిష్, బియ్యాని తిరుపతి, రవీంద్రాచారి, రామ్మూర్తి, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

సంపులో పడిన ఆవు.. రక్షించిన ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఒక నీటి సంపులో పడిన ఆవును కరీంనగర్ ఫైర్ సిబ్బంది రక్షించారు. గురువారం ఉదయం ఒక ఆవు కలెక్టరేట్ క్యాంటీన్ వద్ద ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడిపోయింది. సమాచారం అందడంతో కరీంనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆవును క్షేమంగా బయటకు తీశారు.

విషాహారం తిని గొర్రెలు మృతి

ధర్మారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విషాహారం తిని 10 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని కటికెనపల్లిలో చోటు చేసుకుంది. కటికెనపల్లి గ్రా మానికి చెందిన ఆవుల మల్లేశంనకు 30 గొర్రెల వరకు ఉండగా వాటిని మేపేందుకు శివారులోని ఊర చెరువు సమీపంలోకి వెళ్లారు. బుధవారం సాయంత్రం మేత మేసిన గొర్రెలు ఇంటికి వచ్చే సమయంలో అప్పుడే కోసిన పొలంలో విషాహారం తిని అస్వస్థతకు గురయ్యాయి. గురువారం ఉద యం ప్రాణాపాయస్థితిలో ఉన్న గొర్రెలకు చికిత్స అందించేలోపే 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయని మిగత గొర్రెలు తీవ్ర అస్వస్థతతో ఉన్నాయని యజమాని మల్లేశం తెలిపారు. గొర్రెల మృతితో ఆర్థికంగా నష్టపోయిన తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పురుగుల మందు త్రాగి రామినేని కనకమ్మ (67) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. మతిస్థిమితం సరిగాలేక జీవితంపై విరక్తి చెంది, బుధవారం తన ఇంటిలో ఎవరు లేని సమయంలో పురులమందు తాగింది. కుమారుడు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు రామినేని కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

కాపర్ తీగ చోరీ

వీణవంక, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపల్లి పరిధిలోని ఐలాబాద్ గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో గల 25కెవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని నిందితులు ఎత్తుకెళ్లినట్లు చల్లూరు ఏఈ కాంతామళ్ల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో సత్తాచాటిన విద్యార్థులు


లాస్యను మెమోంటోతో అభినందిస్తున్న అధ్యక్షుడు బాల్‌రాజు

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో సిరిసిల్ల పట్టణ విద్యార్థులు సత్తా చాటారు. గురువారం ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయా పాఠశాలలో మెమోంటోలతో విద్యార్థులను అభినందించారు. సిరిసిల్ల నెహ్రూనగర్‌కు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సాకేత్, ఆడెపు లిఖిత్‌లను ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిసిల్ల అంబేద్కర్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని యెన్నం లాస్య టాలెంట్ టెస్టులో అత్యుత్తమ ప్రతిభను కనబరచగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ప్రధానోపాధ్యాయురాలు ఎస్ రమాదేవి, ఉపాధ్యాయులు మెమోంటోను అందించి అభినందించారు.


విద్యార్థులు సాకేత్, లిఖిత్

గ్యాస్ సిలిండర్ లీకై చెలరేగిన మంటలు


కాలిపోయిన వంట గది

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుమాలకు చెందిన మహేందర్‌రెడ్డి ఇంటిలో గురువారం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. భారీ మంటలు ఎగిసిపడడంతో వంట గదిలోని తినుబండారాలు, వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఘటనలో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు. మహేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లాడు. ఇంట్లోని వంట గది నుంచి పొగలు, మంటలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు ఆయనకు సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న మహేందర్‌రెడ్డి తాళం తీసి చూసే సరికి మంటలు వ్యాపిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, చుట్టు పక్కల వారి సహాయంతో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఐదుగురిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని సీతారాంపూర్‌కు చెందిన భూవివాదంలో ఐదుగురిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపూర్‌కు చెందిన కాసర్ల హన్మంతుకు కొట్టె తిరుపతి, కొట్టె శంకర్, కొట్టె వెంకటేశం, కొట్టె అశోక్, కొట్టె సుధాకర్‌ల మధ్య భూ వివాదం ఉంది. బుధవారం రాత్రి కాసర్ల హన్మంతు భూమిలోకి ప్రవేశించిన ఐదుగురు ప్రహరీ కూల్చివేసినట్లు గురువారం వారిని అడుగగా భూమి తమని చంపుతామని బెదిరించినట్లు బాధితుడు కొత్తపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముత్తారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడిచర్ల ఓసీపీలో కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న ముత్తారం మండలానికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మండలంలోని కేశనపల్లికి చెందిన రాంపల్లి శ్రీధర్, మధుకర్‌గౌడ్ తాడిచర్ల ఓసీపీలో విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బుధవారం వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అడవి పందులు అడ్డువచ్చి వాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో వారు కింద పడి గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు ముత్తారం ఆర్‌పీఎం వద్ద ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని రైల్వేగేట్ వద్ద ఒకటి, బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద మరొక ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ తెలిపారు.

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.

శంకరపట్నం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన గుడెపు బాలకృష్ణ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా కేశవపట్నం శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రపంచ వ్యవసాయ సదస్సులో కోనరావుపేట రైతులు


తెలంగాణలో చేస్తున్న వ్యవసాయంపై జర్మనీ నిపుణులకు వివరిస్తున్న నాగరాజు

కోనరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో జరుగుతున్న అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాతుబండ శ్రీనివాస్, కాటిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు గురువారం పాల్గొన్నారు. సదస్సులో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు సుస్థిర సాగు విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆవిష్కరణలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, మార్గదర్శకులు సదస్సులో చర్చించినట్లు రైతు దూంపేట నాగరాజు తెలిపారు. ఈ సదస్సులో ధూంపేట్ నాగరాజు వ్యవసాయంపై జరిగిన చర్చల్లో పాల్గొని రాష్ట్రంలో రైతులు చేస్తున్న వ్యవసాయ సాగుపై వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయని, అక్కడి రైతులు ఫర్టిలైజర్ క్రిమిసంహారక మందులు ఎక్కువ వాడుతున్నారని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఇచ్చే సాంకేతిక పరిజ్ఞానం అందించాలని కోరారు. ఈ సదస్సులో వెదర్ స్టేషన్ల ద్వారా డేటా సేకరణ, నేల నాణ్యత విశ్లేషణ, స్మార్ట్ అగ్రికల్చర్, టెక్నాలజీ వంటి అంశాలలో ప్రాక్టికల్‌గా జర్మనీ వ్యవసాయ నిపుణులకు చూపించామని తెలిపారు. ఈ సదస్సులో తెలంగాణ అగ్రికల్చర్ శాఖ, అక్రర్డ్ ప్రాజెక్టు అధికారులు నాగరాజు ప్రతిభను ప్రశంసిస్తూ అభినందించినట్లు తెలిపారు.

పెద్దబొంకూర్‌లో చోరీ

పెద్దపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబొంకూర్‌లో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామానికి చెందిన వేముల రమేష్ బుధవారం ఇంటికి తాళం వేసి కూతురు ఇంటికి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి గేట్ తాళం వేసి ఉండగా తలుపునకు ఉన్న తాళం పగలగొట్టి ఉండటంతో బాధితుడు రమేష్ 100కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి రూరల్ పోలీసులు చేరుకొని పరిశీలించగా ఇంట్లో రెండు బీరువా తాళాలు పగలగొట్టడంతో పాటు, బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని అరతులం బంగారం, ఐదు వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు సంచరిస్తున్న సీసీ ఫుటేజి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ముగిసిన ఎంజేపీ పాఠశాలల ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్



తిమ్మాపూర్‌లోని ఎంజేపీలో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న సీఐ సదన్‌కుమార్, సుల్తానాబాద్‌లో అతిథులు..

తిమ్మాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 11న ప్రారంభమైన సీనియర్, జూనియర్ బాలికల ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అండర్ -14, అండర్-19 అంశాలలో 15 ఎంజేపీ పాఠశాలలు, 15 క్రీడాంశాలలో 636మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి తిమ్మాపూర్ సిఐ సదన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌సివో అంజలి, ప్రిన్సిపాల్స్ సరిత, సృజన, విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● విజేతలుగా సుల్తానాబాద్, బీర్పూర్ జట్టు

సుల్తానాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14, 19 విభాగంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో సుల్తానాబాద్, జగిత్యాల జిల్లా బీర్పూర్ జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించి, విజేతగా నిలిచాయి. మండలంలోని భూపతిపూర్‌లోని జ్యోతిరావుపూలే గురుకులంలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. విజేతలకు ముఖ్యఅతిథిగా రామగుండం గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శిరీష చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. సుల్తానాబాద్ జట్టు అండర్ 19 విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్‌తోపాటు వ్యక్తిగత చాంపియన్ షిప్‌ను అంజి గెలుచుకున్నారు. అలాగే అండర్ 14లో ఓవరాల్‌గా బీర్పూర్ జట్టు సాధించగా, విజయ్ వ్యక్తిగత చాంపియన్‌గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి ప్రిన్సిపాల్ జయసింగ్, సుల్తానాబాద్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్, సంక్షేమ అధికారి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మెట్‌పల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో గురువారం అనుమానాస్పద స్థితిలో ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బగ్గాల లక్ష్మి అలియాస్ నేరెళ్ల రాజగంగు(50) మృతిచెందింది. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన లక్ష్మికి ఇద్దరు కూతుళ్లు కాగా పెళ్లిలు చేసిన అనంతరం భర్తతో విడిపోయి మెట్‌పల్లి పట్టణంలో ఒంటరిగా నివాసం ఉంటోంది. లక్ష్మీ కొంతకాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతోంది.

బుధవారం ఆమె ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు ఆమె చిన్నకూతురు అనూషకు సమాచారం ఇచ్చారు. ఆమె ఇంటికి వచ్చి చూసే సరికి మంచంపై లక్ష్మి మృతదేహం నగ్నంగా ఉన్నట్లు తెలిపారు. లక్ష్మి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ చిన్న కూతురు అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ వివరించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


ధనుష్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి ధనుష్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. సిరిసిల్ల పట్టణం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ధనుష్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు తడక సురేష్, ఉపాధ్యాయులు గురువారం మెమోంటోతో అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయురాలు శారద మాట్లాడుతూ శుక్రవారం, శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని డాన్ బాస్కో అకాడమిలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ధనుష్ పాల్గొంటారని అన్నారు.

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జోన్ ఈడీ పగిడిమర్రి సోలమన్

భగత్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లతో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని రీజియన్ల పనితీరు, ఆర్థిక పరిస్థితి, ప్రమాదాల నివారణ చర్యలు, రానున్న మేడారం జాతరకు సన్నద్ధతను సమీక్షించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు బి రాజు, డి విజయభాను, టి జ్యోత్స్న, ఎ సరిరాం, ఎస్ భవాని ప్రసాద్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, ఎస్ మధుసూదన్, కె భానుకిరణ్, మహేష్, వి మల్లయ్య, ఎస్ రామయ్య, డి శ్రీహర్ష, డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ స్వప్నకుమారి, ఎస్ ప్రణీత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యదర్శి కె యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో మంత్రి లక్ష్మణ్‌కుమార్ పూజలు



పూజలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ఉదయం సందర్శించారు. ఆలయం పక్షాన వేదపండితులు, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మొదట ఆయన ధ్వజ స్థంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శనం చేసుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు మంత్రి యమధర్మ రాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోశారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయం పక్షాన ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ఘనంగా ఆశీర్వదించారు.


ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, చిలుముల లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి డీఎడ్ పరీక్షలు

కరీంనగర్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీఎడ్ మొదటి సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 1 నుండి 6వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్ హైస్కూల్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు (ఉర్దూ) ముకరంపుర లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

దక్షిణాదికి విద్యుత్ అందిస్తున్న రామగుండం ఎన్టీపీసీ..!

- నేడు వ్యవస్థాపక దినోత్సవం
- సీఎస్ఆర్ నిధులతో సామాజిక కార్యక్రమాలు





ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన అప్పటి ప్రధాని మొరార్జీదేశాయ్(ఫైల్)

జ్యోతినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది విద్యుత్ అవసరాలను తీర్చంలో రామగుండం ఎన్టీపీసీ కీలక పాత్ర పోషిస్తున్నది. యేటా ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నది. 1978 నవంబరు 14 అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ చేతుల మీదుగా పునాది రాయి పడింది. నిర్ణీత గడువు కన్నా ముందే ఉత్పత్తిని ప్రారంభించాయి. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు రోజుకు 42 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. 2100 మెగా వాట్ల సామర్థ్యం ఉన్న స్టేజ్ 1, స్టేజ్ 2 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి సింగరేణి నుంచి రోజుకు 32వేల మెట్రిక్ టన్నులు, ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి 8వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఒప్పందం ఉంది. ప్రాజెక్టు అవసరమైన 6.5 టీఎంసీల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ ఉంచుతారు.

● ప్రాజెక్టుకు అవార్డులు.. రివార్డులు..

రామగుండం ఎన్టీపీసీకి 47 సంవత్సరాలలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. 2025 ఎనర్జీ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. రాజ్ భాష హిందీ అమలులో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి జాతీయస్థాయి పురస్కారం లభించింది. టీఎస్‌టీపీపికి నేషనల్ సేఫ్టీ 2025 అవార్డు లభించింది.

ఏ రాష్ట్రానికి ఎంత విద్యుత్...

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు 754 మెగావాట్లు(29శాతం)
- తమిళనాడుకు 572 మెగావాట్లు(22శాతం)
- కర్నాటకకు 416 మెగావాట్లు(16శాతం)
- కేరళకు 312 మెగావాట్లు(12శాతం)
- గోవాకు 130 మెగావాట్లు(5శాతం)
- పాండిచ్చేరికి 52 మెగావాట్లు(2శాతం)
- ఎవరికీ కేటాయించనిది(అన్ అలాటెడ్) 364మెగావాట్లు(14శాతం)

● సామాజిక బాధ్యత..

విద్యుత్ ఉత్పత్తితోపాటు ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నది. సీఎస్ఆర్ నిధులు వివిధ కార్యక్రమాలకు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, గ్రామాలలో వసతుల కల్పన, విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి కోసం సంస్థ చేయూతనిస్తోంది. విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఉపకార వేతనాల కార్యక్రమాలను చేపట్టింది.

● పర్యావరణ పరిరక్షణకు కృషి

ఎన్టీపీసీ పరిసర ప్రాంతంలో సుమారు 14 లక్షల చెట్లను సంస్థ సంరక్షిస్తున్నది. ప్రాజెక్టు నుంచి వెలువడే బూడిద సమస్యను నివారించడానికి ఎన్టీపీసీ వినూత్న పథకాలను అమలు చేస్తోంది. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రాజెక్టుకు ఐఎస్‌వో-14001 గుర్తింపు లభించింది.

● టిఎస్‌టిపిపి స్టేజ్ 2 నిర్మాణానికి రెడీ..

రామగుండం ఎన్టీపీసీ ఆవరణలో 4000 మెగా వాట్ల మరో ప్రాజెక్టును నిర్మిస్తోంది. మొదటి దశలో 800 మెగావాట్ల రెండు యూనిట్లు పూర్తయ్యాయి. మరో 2400 మెగావాట్ల నిర్మాణం జరగనుంది.

సమష్టి కృషితో ప్రగతి పథంలో

- ఈడీ చందన్ కుమార్ సామంత

ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికుల సమష్టి కృషి ఫలితంగా రామగుండం ప్రాజెక్టు ప్రగతిపథంలో నడుస్తోంది. రక్షణతో కూడిన నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్య తనిస్తాం. ఉత్పత్తి, రక్షణ, పర్యావరణ పరిరక్షణ, సీఎస్ఆర్, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. ఎన్టీపీసీ రేజింగ్ డే సందర్భంగా సిబ్బందికి, ఈ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు.

● యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభ వివరాలు

స్టేజ్-1
200 మెగావాట్ల 1వ యూనిట్ 1983 అక్టోబర్ 26
200 మెగావాట్ల 2వ యూనిట్ 1984 మే
200 మెగావాట్ల 3వ యూనిట్ 1984 డిసెంబర్

స్టేజ్-2
500 మెగావాట్ల 4వ యూనిట్ 1988 జనవరి
500 మెగావాట్ల 5వ యూనిట్ 1989 మార్చి
500 మెగావాట్ల 6వ యూనిట్ 1989 అక్టోబర్

స్టేజ్-3
500 మెగావాట్ల 7వ యూనిట్ 2004 సెప్టెంబర్

శ్రీరాంసాగర్‌కు 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇసుక డంప్ సీజ్



అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపు

సుల్తానాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్‌లో ఇసుక అక్రమ డంప్‌ను జిల్లా అధికారులు పట్టుకున్నారు. ఇక్కడి నుంచి కొన్ని నెలలుగా హైదరాబాద్, కరీంనగర్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అధికారులు తెలిపారు. జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాస్ వివరాల మేరకు మండలంలోని నారాయణపూర్‌లో ఒక పాతరైస్ మిల్లు వద్ద ఇసుకను అక్రమంగా డంపు చేస్తున్నారని, మండలంలోని మానేరు పరివాహక ప్రాంత గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకువచ్చి ఇక్కడ నిల్వ చేస్తున్నారని వివరించారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు. నారాయణపూర్ రైస్ మిల్‌లో ఇసుక కుప్పలుగా పోసి రాత్రి వేళల్లో కరీంనగర్, హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. తెల్లవారుజామున రెండు లారీలు, ఒక జీపును సీజ్ చేసి ఆర్డీవో ఆఫీసుకు తరలించినట్లు ఆయన తెలిపారు. అధికారుల ఆకస్మిక దాడిలో కొన్ని వాహనాలను తప్పించినట్లు తెలిసింది.

కొండగట్టులో ఆర్జితసేవల ధరల పెంపునకు బ్రేక్

● హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు ● ధరలు పెంచొద్దని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

మల్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో ఈ నెల 15నుంచి ఆర్జిత సేవల టికెట్ల రెట్లను రెట్టింపు చేస్తూ మరిన్ని కొత్తగా అర్జితసేవలను ప్రారంభించనున్నట్లు ఇటీవల దేవస్థానం అధికారులు ప్రకటించగా వాటి అమలును వాయిదా వేస్తున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూజ టికెట్ల పెంపు భక్తులకు భారం కానుందని భక్తులు, హిందూ సంస్థలు, రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత వచ్చింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దేవాదాయ శాఖ కమిషనర్, దేవస్థానం ఈవోతో గురువారం ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో టికెట్ల పెంపు అమలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. భక్తులకు కనీస వసతులు కల్పించక అనేక ఇబ్బందుల పడుతుంటే రాబడే ధ్యేయంగా టికెట్ల పెంపు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తడంతో దేవస్థానం అధికారులు పెంపు యోచనకు తాత్కాలికంగా బ్రేక్ వేశారు. నూతనంగా సుప్రభాతసేవ, వడమాల భోగము, మన్యసూక్త హోమం, శనిగ్రహ పీడ నివారణ ప్రవేశపెట్టారు. గతంలో నుంచి కొనసాగుతున్న అభిషేక పూజ, చందనం పూజ, గండదీపం, శాశ్వత అభిషేకం, 11 రోజుల హారతి అర్జిత సేవల ధరలను భారీగా పెంచారు. వీటి అమలును అధికారులు వాయిదా వేశారు. కొండగట్టుకు వచ్చేది అత్యధికంగా సామన్య భక్తులేనని అయితే ధరల పెంపు భక్తులకు భారం అవుతుందని అన్నివర్గాల నుంచి నిరసనలు రావడం, ఇటీవల బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు దేవస్థానం అధికారులకు ధరలు పెంచొద్దని వినతిపత్రం అందించారు. ఈనెల 15 నుంచి ప్రారంభించే నూతన పూజలలోని సుప్రబాత సేవను మంగళవారం దేవస్థానం అధికారులు ప్రారంభించి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. అయితే నూతన అర్జిత సేవలు, టికెట్ల పెంపు వాయిదా వేస్తున్నటుట్లు గురువారం అధికారులు ప్రకటించడం గమనార్హం. ఎట్టకేలకు టికెట్ల ధరల పెంపు వాయిదా పడడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈవో శ్రీకాంత్‌రావును సంప్రదించగా భక్తుల నుంచి అభ్యంతరాలు, పార్టీల నుంచి వినతులు రావడంతో ఎండోమెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళతానని వారికి హామీ ఇచ్చిన మేరకు కమిషనర్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యలు మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.



ఆలయంలో ఏర్పాటు చేసిన ధరల సూచిక

భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి)/మల్యాల: కొండగట్టులో పెంచిన అర్జిత సేవా టిక్కెట్ల రేట్లను తగ్గించి, భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కొండగట్టులో భక్తులకు అర్జిత సేవా టికెట్లు పెంపుపై మల్యాల బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం కేంద్ర మంత్రి హోంశాఖ సహాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆలయ అధికారులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కొండగట్టు ఆలయంలో కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాల మీద దృష్టి సారించాల్సిన అధికారులు అర్జిత సేవా టికెట్ల ధరలు పెంచడ మేమిటని ప్రశ్నించారు. తక్షణమే పెంచిన అర్జిత సేవా టికెట్ల రేట్లను తగ్గించాలని, కొండగట్టులో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి సారించి భక్తుల ఇబ్బందులు తొలగించాలన్నారు.

శాతవాహనలో యాంటీ ర్యాగింగ్‌పై సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కోటేశ్వర్, పక్కన ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుజాత

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాంటీ ర్యాగింగ్, మహిళా భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణపై శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి మాట్లాడుతూ ర్యాగింగ్ చేసినట్టు తెలిస్తే కళాశాల నుంచి డిస్మిస్ చేయడమే కాకుండా పోలీస్ కేసు నమోదవుతుందన్నారు.

కొత్తపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం చట్టరీత్యా నేర మని అలాంటి విద్యార్థులు శిక్షార్హులు అవుతారని అన్నారు. షీ టీమ్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో ఎవరినీ వేధించవద్దన్నారు. కేసు నమోదైతే జీవితంలో వారికి ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాదని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత మాట్లాడుతూ విద్యార్థులు అనవసర విషయాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, చీఫ్ వార్డెన్ డాక్టర్ నజీముద్దీన్ మున్వర్, హాస్టల్ వార్డెన్స్ డాక్టర్ కృష్ణకుమార్, సావిత్రి, కేర్ టేకర్ సంధ్య, రమేష్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి హారతి



గోదావరి మాతకు హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 23వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌శర్మ భక్తులను ఉద్దేశించి ధార్మిక ప్రసంగం చేశారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరుగుతునన కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, అర్చకలు, వేదపండితులు, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీ వల్లి సేవా గ్రూపు సభ్యులు, స్థానిక మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

18న ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌పై అవగాహన సదస్సు




సమావేశంలో మాట్లాడుతున్న సమద్‌నవాబ్

కరీంనగర్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌పై ఉమ్మడి జిల్లా అవగాహన సదస్సును ఈ నెల 18న నిర్వహిస్తున్నామని, సదస్సుకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ డెవెలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సమద్‌నవాబ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెల 18న నగరంలోని కరీంనగర్ ఫంక్షన్ హాల్‌లో ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌కు సంబంధించిన మూడు అంశాల మీద చర్చ నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఈద్గా, దర్గా, ఖబ్రస్తాన్, మసీద్ , మదర్సా కమిటీ అధ్యక్షులు, సభ్యులు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నాయకులు, మైనారిటీ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎండీ లయిక్, అబ్దుల్ రెహమాన్, ఎండీ చాంద్, ఇర్ఫాన్, మొహమ్మద్ ఖలీముద్దీన్, మహమ్మద్ ఆమేర్, మన్సూర్, తవక్కలి తదితరులు పాల్గొన్నారు.

తీయని బాధ

నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చక్కెర.. ప్రతి మనిషి జీవితంలో కీలకపాత్ర వహిస్తుంది.. ఏదైనా శుభవార్త విన్నప్పుడు నోటిని తీపి చేసుకో అనడం పరిపాటి. ప్రస్తుతం ఆ నానుడి మారుతోంది.. ప్రతి ఒక్కరూ చక్కెరకు సాధ్యమైనంత దూరంగా ఉండండి అంటున్నారు. ఇందుకు కారణం మధుమేహం.. మన దేశంలో దాదాపు 12 కోట్లమంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. 14 కోట్లకు పైగా ప్రీడయాబెటిస్ (భవిష్యత్‌లో డయాబెటీస్ వచ్చేవారు) స్థితిలో ఉన్నారు. ఇన్సులిన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బ్యాంటింగ్ జయంతి నవంబరు 14. ప్రపంచ వ్యాప్తంగా అతివేగంగా పెరుగుతున్న మధుమేహవ్యాధిని దృష్టిలో ఉంచుకొని ఐడీఎఫ్, (డబ్ల్యుహెచ్‌వో) ప్రపంచ ఆరోగ్య సంస్థలు సంయుక్తంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ప్రతి సంవత్సరం నవంబరు 14ను ప్రపంచ మధుమేహ దినంగా 1991 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సర నినాదం 'మధుమేహ వ్యాధి రోగుల శ్రేయస్సు'.



● మధుమేహం అంటే ఏమిటి?

ఇన్సులిన్ శరీరంలో సరిగా తయారు కాకపోవడం వల్ల, ఇన్సులిన్ సరిగా ఉపయోగపడక పోవడంవల్ల రక్తంలో షుగర్ లెవల్ అతిగా పెరిగిపోతుంది. ఇది హానికరం. ఇది దీర్ఘకాలిక వ్యాధి. ఒక్కసారి వచ్చిందంటే జీవితాంతం ఉంటుంది. కాబట్టి ఈ జబ్బుకు వైద్యం చేసే సమయంలో రోగితో పాటు అతని కుటుంబ సభ్యులు కూడా బాధ్యత భాగం తీసుకోవాలి. జబ్బు లక్షణాలు, దాని ప్రభావాల గురించి అవగాహన పెంచుకొని షుగర్ లెవల్స్‌ను అదుపులో పెట్టుకోవాలి. సరైన వ్యాయామం చేస్తే, ఆహార నియమాలు, డాక్టర్ ఇచ్చే సలహాలు పాటించాలి. మధుమేహ రోగులు అదుపులో ఉన్న చక్కెర శాతంతో సాధారణ జీవితం గడపవచ్చు. కనీసం రోజుకు ఏడు గంటలు నిద్రపోవాలి. ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండండి. కొలెస్ట్రాల్‌ను, శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

● ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు

మధుమేహ రోగులు చిన్న మార్పులతో సాధారణ ఆహారం తీసుకోవచ్చు. చక్కెర, తీపివస్తువులు, వెన్న, నెయ్యి అతిగా నూనెలు వాడవద్దు. కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. తెల్లని బియ్యం, తెల్లని బ్రెడ్, మైదాపిండి వాడకం తగ్గించాలి. వాటి స్థానంలో దంపుడు బియ్యం, బ్రౌన్ బ్రెడ్, ఓట్స్ లాంటివి వాడటం మంచిది. తాజా కూరగాయల్ని, పండ్లను ఎక్కువగా తీసుకోవాలి.

● వైద్యుల సలహాలు పాటించాలి..

- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్



డయాబెటిక్ వచ్చినవారు సకాలంలో డాక్టర్‌ను సంప్రదించాలి. డాక్టర్ సూచించిన విదంగా మందులు వాడుతూ సలహాలు సూచనలు పాటించాలి. ఆహార నియమాలను పాటించాలి. డయాబెటిస్ ఉందని భయపడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. మూడు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు మెరుగ్గా చేసుకొవాలి. సంవత్సరానికి ఒకసారి కంటి పరీక్ష, ఈసీజీ, కిడ్నీ పరీక్షలు చేసుకోవాలి. డయాబెటిస్ రాకుండా ఉండాలంటే తగినంత శారీరక శ్రమ చేస్తూ సమతుల్య ఆహారం తీసుకోవాలి. రోజు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. పౌష్ఠికాహారం లోపంతో టైప్-5 డయాబెటీస్‌ను గుర్తించారు. ఈ విషయాన్ని ఇటీవల కేరళలో నిర్వహించిన అఖిల భారత మధుమేహ వైద్యుల సదస్సులో నిపుణులు వెల్లంచారు. సాదారణంగా వివిద కారణాల వల్ల ప్రాంక్రియాస్ చెడిపోతే షుగర్ వ్యాధి వస్తుంది. కాని టైప్-5 పౌష్ఠికాహార లోపం వల్ల వస్తుందని గుర్తించారు. వీరు చూడడానికి సాదారణంగానే కనిపిస్తారు.

ప్రమాదకరంగా వరదకాలువ వంతెనలు

- కూలిన రక్షణ గోడలు



ముత్యంపేట శివారులో వాహనాలు ఢీకొనడంతో కూలిన రక్షణగోడ

మల్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరదకాలువ వంతెనల వద్ద నిర్మించిన రక్షణగోడలు కూలి ప్రమాదకరంగా మారాయి. మల్యాల మండలంలోని రాంపూర్, గొల్లపల్లె, రామన్నపేట, నూకపల్లి, ముత్యంపేట, సర్వాపూర్ గ్రామాల పరిధిలో గల వరదకాలువపై రహదారిపై వంతెనలు నిర్మించగా వాటి రక్షణగోడలు చాలా చోట్ల వాహనాలు ఢీకొని ధ్వంసం అయ్యాయి. టిప్పర్లు, ఇతరవాహనాలు ఢీకొనడంతో దెబ్బతింటున్నాయి. నెలల తరబడి వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.



వాహనం ఢీకొని ధ్వంసం అయిన రక్షణ గోడ

విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలి

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తమ తల్లిదండ్రుల కలలతో పాటుగా తమ భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టిసారించి ముందుకు సాగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, వీడి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దండు వినోద్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మీ వీధిలోని కేజీవీబీ బాలికల రెసిడెన్సీలో గురువారం విద్యార్థులకు కెరీర్ చార్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని, దాన్ని సాధించే దశగా అడుగులు వేయాలని సూచించారు. ఇంటర్ పూర్తికాగానే విద్యార్థులు భవిష్యత్తులో ముందుకు వెళ్లేందుకు ప్రణాళిక ఉండాలని, లక్ష్యం సాధించేందుకే కెరీర్ చార్ట్స్ క్యాలెండర్ ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కేజీవీబీ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, బీసీ సంఘం నాయకులు మంద మనోహర్, వంగ మహేందర్, నవీన్, నాగండ్ల మధు తదితరులు ఉన్నారు.

భవానీనగర్‌లో సమస్యల తిష్ఠ..

- అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ
- ఇళ్లలోకి వస్తున్న పందులతో ఇబ్బందులు

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని భవానీనగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. గత సంవత్సర కాలంగా డ్రైనేజీని తీయడం లేదని, మున్సిపల్ సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో నీరు పారుతున్నప్పటికి సిల్ట్ తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని సీసీ రోడ్డుకు ఇరువైపులా స్థానికులు తొలగించిన వ్యర్థాలను సైతం మున్సిపల్ సిబ్బంది తీసుకు వెళ్లడం లేదని పేర్కొంటున్నారు. దీంతో స్థానికులు వ్యర్థాలను రోడ్డుపైన కాల్చివేసినా బూడిదను కూడా తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది రాకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



భవానీనగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ

ఇళ్లలోకి వస్తున్న పందులు..

డ్రైనేజీ వ్యవస్థ అక్కడక్కడా కూలిపోయి అస్తవ్యస్తంగా మారిందని, దీంతో పందులకు అవాసంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, తలుపులు తీసి ఉంటే ఇంట్లోకి కూడా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రెండేళ్ల సంవత్సరాల క్రితం సీసీ రోడ్డు నిర్మించడంతో పాత డ్రైనేజీ పూర్తిగా కిందకు అయిపోయిందని, దీంతో వర్షకాలం ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పత్తాలేని మున్సిపల్ సిబ్బంది..

- ఊరడి సుశీల, కాలనీవాసి

కాలనీలో డ్రైనేజీలో వ్యవర్థాను తొలగించక సంవత్సరం అవుతోంది. సీసీ రోడ్డు పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తే తీసుకువెళ్లడం లేదు. మేమే నిప్పు అంటించి కాల్చి వేశాం. గాలికి బూడిద ఇళ్లలోకి వస్తోంది. చాలా రోజులుగా చెత్త బండి కానరాలేదు.



పందులతో ఇబ్బందులు..

- కనపర్తి చంద్రకళ, కాలనీవాసి

భవానీనగర్ పందులకు అవాసంగా మారింది. ఎక్కడ చూసినా పందులే కనిపిస్తున్నాయి. ఆదమరిచి తలుపు తీసి ఉంటే పందులు ఇళ్లలోకి వస్తున్నాయి. ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. మున్సిపల్ అధికారులు దృష్టిసారించి పందుల బెడద లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి.



‘భౌ’బోయ్..

(5వ పేజీ తరువాయి)

ఎప్పుడైనా లక్షణాలు కనబడవచ్చు. సాధారణంగా నాలుగు నుంచి 8 వారాల్లో బయటపడుతుంది. మెదడు దగ్గర కుక్క కరిస్తే త్వరగా, ఇతర ప్రాంతాల్లో కరిస్తే కొంత ఆలస్యంగా లక్షణాలు బయటపడుతాయి. గీచుకుపోయిన గాయం ద్వారా అయితే కొంత సమయం పడుతుంది. లోతుగా పండ్లు దిగి కండను పీకేసినా త్వరగా లక్షణాలు బయటపడుతాయి. కరిచిన చోట నొప్పి, పొడిచినట్లు బాధ తలనొప్పి, గొంతువాపు, ఒళ్లు నొప్పులు, నీరసం ఆకలి మందగించడం, వాంతులు, పొడిదగ్గు, నాడీ మండలానికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తాయి. రోగ నిరోధక శక్తి ఉన్న సమయంలోనే పిచ్చికుక్క కరిస్తే వారం రోజులకు ఒకటి చొప్పున ఇంజక్షన్లు తీసుకోవాలి. రేబీస్ వ్యాధి రాకుండా ముందే ఇంజక్షన్లు తీసుకోవడం ద్వారా నియంత్రించవచ్చు. రేబీస్ వ్యాధి వచ్చిన తరువాత చికిత్స లేదనే చెప్పుకోవచ్చు.

స్పోర్ట్స్ మీట్‌కు హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



జ్యోతిప్రజ్వలనతో స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ యాజమాన్యం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. చదువుతోపాటు ఆటలు, పిల్లలకు ఎంతో అవసరమని తెలిపారు. ఆటలతో విద్యార్థుల్లో మానసిక ప్రశాంతతో పాటు శారీరక ధృడత్వం పెరుగుతుందని అన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను పిల్లలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యంతో పాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి



వినతిపత్రం అందజేస్తున్న భోజన నిర్వాహకులు

బోయినపల్లి నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకంను అక్షయపాత్రకు ఇవ్వడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ అన్నారు. బోయినపల్లి మండల విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వడాన్ని విరమించుకోవాలని గురువారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ప్రైవేటు సంసలకు ఇవ్వరాదని, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని కొడంగల్ నియోజకవర్గంలో అక్షయపాత్రకు ఇవ్వడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పెండింగ్‌లో ఉన్న కోడి గుడ్డు, 9, 10వ తరగతుల, 2000 వేతనం, అల్పాహారం బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన ప్రకారం 10 వేల రూపాయలు వేతనాన్ని అమలు చేయాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యం నెరవేరాలంటే స్లాబ్ రేటు రూ.25 ఇవ్వాలని, లేదా నిత్యావసర వస్తువులు, కోడిగుడ్లు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు ద్వారా ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ., సామాజిక ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు కవిత, లావణ్య, మల్లయ్య, ఎంకవ్వ, పోచవ్వ, నిర్మల, సుగుణ, బారతవ్వ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు చట్టపరంగా అమలు చేయాలి..

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు



దీక్షలో కూర్చున్న బీసీ నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీల 42 శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా కాకుండా చట్టపరంగా రిజర్వేషన్లు అమలుచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్షహన్మాండ్లు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి తీర్మానం చేసి రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా పర్శహనాండ్లు మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో చిత్తశుద్ధితో పని చేస్తున్నారని దానికి అనుగుణంగా బీసీ కులగణన చేసి అసెంబ్లీలో బీసీ బిల్లును తీర్మానం చేసి గవర్నర్, రాష్ట్రపతికి పంపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు సడలకుండా బీసీల రిజర్వేషన్లు సాధించే వరకు పట్టుదలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు తడకు కమలాకర్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, కుమ్మరి శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు రాధారపు శంకర్‌గౌడ్, మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రతినిధి బండారి బాల్‌రెడ్డి, గౌడ సంఘం జిల్లా ప్రతినిధి కందుకూరి రామాగౌడ్, యాదవ సంఘం జిల్లా ప్రతినిధి రాములు, రజక సంఘం జిల్లా ప్రతినిధి కంచర్ల రాజు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రతినిధి తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సిరిసిల్ల మండల కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సిరిసిల్ల మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నతా పాఠశాలలో సిరిసిల్ల మండల మహాసభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ మాటాడారు. అనంతరం సిరిసిల్ల మండల కమిటీ నియమించారు. మండల అధ్యక్షులుగా వంగా మల్లేశంగౌడ్, ప్రధానకార్యదర్శి దాసరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా బత్తిని అనిల్‌కుమార్, వెన్నెల, కోశాధికారిగా పల్లెవేణి ఐలయ్య, కార్యదర్శులుగా జంగిటి భానుచందర్, గంగారాం, బైరి శ్రీనివాస్, రాములును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి గురువారం సిరిసిల్ల ఎస్‌బీఐ లైఫ్ అధికారి మంత్రి రాంప్రసాద్ రూ. 20 లక్షల బీమా చెక్కును అందజేశారు. గర్షకుర్తి గ్రామానికి చెందిన కొండి శ్రీనివాస్ ఎస్‌బీఐలో బీమా చేసి రెండు సంవత్సరాలు ప్రీమియాలను చెల్లించగా ఓ యాక్సిడెంట్‌కు గురై మరణించాడు. దీంతో యాక్సిడెంట్ బెనిఫిట్‌లో భాగంగా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఏజెంట్ వలస చంద్రశేఖర్, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో గురువారం చలో ఢిల్లీ కరపత్రాన్ని ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మన్, ఎంఆర్పీఎస్ జిల్లా కన్వీనర్ యెలగందుల బిక్షపతి మాట్లాడారు. ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని నాయకులు, మేధావులు, విద్యార్థులు, కార్మికులు, ఎంఆర్పీఎస్ అనుబంధ సంఘాల పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఆవునూరి ప్రభాకర్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్రెడ్డి రాజు, ఎంఆర్పీఎస్ జిల్లా కన్వీనర్ సావనపెల్లి రాకేష్, వీహెచ్‌పీ జిల్లా కన్వీనర్ సడిమెల శోభరాణి, ఎంఆర్పీఎస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు బడుగు లింగం జిల్లా, పట్టణ నాయ కులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

ఇల్లంతకుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామానికి చెందిన రొండ్ల కిష్టారెడ్డికి సీఎం సహాయనిధి ద్వారా ఎల్‌ఓసీ మంజూరు అయ్యింది. కిష్టారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రూ 2.50లక్షల ఎల్‌వోసీని ఇప్పించారు. ఈసందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యేకు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డికి మాజీ ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో అనారోగ్యంతో బాధ పడుతున్న పేద దంపతులు నీరంక లత- రవిల వైద్యానికి తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అతని సోదరుడు రామారావు, కొడుకు అఖిల్‌రావులు గురువారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఖరీదైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న పేద దంపతుల పరిస్థితిని చూసి మానవత్వంతో స్పందించారు. ప్రభుత్వం వైద్యం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, సుధాకర్‌రావు, బాబు, శంకర్, గోపాల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి, కోరుట్లపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను నాఫ్స్‌కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు గురువారం పరామర్శించారు. కోరుట్లపేటలోని బొంపెల్లి గంగమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాచర్లగొల్లపల్లిలోని కాంగ్రెస్ నాయకుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందగా ఆయనను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు రాజేశం, సుభాష్, గిరిధర్‌రెడ్డి, రమేశ్, అంజనేయులు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

వేములవాడలో కాళోజీ వర్ధంతి

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాకవి, ఉద్యమకారుడు, అన్యాయంపై ధిక్కారస్వరం కాళోజీ నారాయణరావు వర్ధంతిని వేములవాడ పట్టణంలోని న్యూఅర్బన్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాళోజీ రాజకీయ సాంఘీక చైతన్యాల సమాహారం అని కవిత్వం రాసిన ప్రజా కవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, మంజుల తదితరులు ఉన్నారు.

వేములవాడలో గుండెపోటుతో ఇద్దరి మృతి

వేములవాడ టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో గురువారం ఇద్దరు వ్యక్తులు గుండెపోటుతో మృతిచెందారు. తిప్పాపూర్‌కు చెందిన సోమినేని మల్లేశం(42) వేకువజామునే నిద్రలేచి స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఉదయం ఇంటికి వచ్చిన తర్వాత అకస్మాత్తుగా కుర్చీలోనే కూర్చుండి కింద కూలిపోయాడని భార్య మానస ద్వారా తెలిసింది. మార్కండేయ నగర్‌కు చెందిన సుంకి రవి(51) కూడా ఉదయం వేకువజామున బాత్రూంకి వెళ్లి కుప్పకూలాడు. గమనించిన భార్య సునీత ఆసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఈనెల 14న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు చేసుకున్న దివ్యాంగులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని ఎంపీడీవో సత్తయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో యూనిట్ రూ.50 వేలకు చేసుకున్న దరఖాస్తుదారులు హాజరు కావాలని పేర్కొన్నారు. అన్ని బ్యాంకుల అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు. దివ్యాంగ దరఖాస్తుదారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో సత్తయ్య కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దంపతులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని పార్వతి రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో మహా కుంభాభిషేకం, కాలభైరవస్వామి, సంతాన నాగేంద్రస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో సుప్రభాతం, రుద్రాభిషేకం, ప్రధాన కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. లక్ష నాణేములతో స్వామి వారికి అభిషేకం జరిపించారు. దంపతులు భక్తిశ్రద్ధల నడుమ పాల్గొని పూజలు చేశారు. ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఇల్లంతకుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ పేలుళ్ల మృతులకు సంతాపం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, మ్యాకల మల్లేశం, కొలనూరి ముత్తవ్వ, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, కూనబోయిన బాలరాజు, పిల్లి గోపాల్, తుమ్మనపల్లి కమలాకర్‌రావు, పినకాసి అనీల్, కూనబోయిన పర్శరాం, నాయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల పోరాట స్ఫూర్తితో ముందుకు..

- ప్రొఫెసర్ కొల్లాపురం విమల



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న కళాకారులు, తదితరులు

వేములవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ రంగవల్లి తదితర అమరవీరుల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని రచయిత్రి, సామాజిక ఉద్యమకారిణి ప్రొఫెసర్ కొల్లాపురం విమల పిలుపునిచ్చారు. రంగవల్లి జ్ఞాపకార్థం నిర్మించిన విజ్ఞాన కేంద్రం ప్రథమ వార్షికోత్సవ సభ జరిగింది. వేములవాడ పట్టణంలోని నందికమాన్ చౌరస్తా సమీపంలోని విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి అరుణోదయ విమలక్క అధ్యక్షత వహించారు. నందికమాన్ నుంచి రంగవల్లి విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈసందర్భంగా రచయిత్రి, సామాజిక ఉద్యమకారిణి ప్రొఫెసర్ కొల్లాపురం విమల మాట్లాడుతూ ఒక మహిళ పేరు మీద విజ్ఞాన కేంద్ర ఉండటం సంతోషకరమన్నారు. రంగవల్లి తదితర అమరవీరుల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. నాటి వీర తెలంగాణ సాయుధ పోరాటం కాలంలో గ్రంథాలయ పాత్రను వివరించారు. తమ కోసం కాకుండా పేద ప్రజల కోసం పోరాడినారని గుర్తుచేశారు. నాడు భూస్వాములకు, దొరలకు, దోపిడీదారుల ఆగడాలకు చరమగీతం పాడడంలో ప్రజలు ముందు వరుసలో ఉన్నారని గుర్తు చేశారు. సమస్త ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటమే ఏకైక మార్గమన్నారు. అనంతరం ప్రముఖ కవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ ప్రపంచంలో పుస్తకాలు ఇప్పటికీ చిరంజీవిగానే ఉన్నాయని అన్నారు. ప్రజాసాహిత్యం ప్రజల కొరకు పనిచేస్తుందన్నారు. ప్రజలకు ప్రశ్నించే తత్వాన్ని గ్రంథాలయాలు నేర్పుతాయన్నారు. ప్రజా గ్రంథాలయాలు మార్పు కోసం పని చేస్తాయని కొనియాడారు. అమరులు ఈ సమాజానికి దిక్సూచిగా నిలిచారన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఆలోచనలు గ్రంథాలయాల వల్ల ఎన్నో పుట్టుకొస్తాయని తెలిపారు. గ్రంథాలయాల నిర్వహణలో ప్రజలు భాగస్వాములు కావాలిసన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగవల్లి విజ్ఞాన కేంద్రం నాయకులు పోకల సాయికుమార్, రాజేశ్వరి, చెన్నమనేని పురుషోత్తంరావు, నరాల దేవేందర్, రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం, నాయకులు రాయమల్లు, వంగల సంతోష్, అనసూయ, లక్ష్మి, వెంకటలక్ష్మి, అనిల్, వేణు, ప్రకాష్, దేగల రమ, మల్హార్, రాకేష్ తదితరులు ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవమైంది. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో ఎన్నికలను నిర్వహించారు. సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మాదాసు బలరాం, ప్రధాన కార్యదర్శి చౌకి సుధాకర్, కోశాధికారి శ్రీగాధ దేవదాస్, అసోసియేట్ అధ్యక్షుడు వీ రాజారెడ్డి, ఉపాధ్యక్షులు ఎం రామస్వామి, పీ రవీందర్, కార్యదర్శులు ఏ శ్యాం, జీ హరికిషన్, సంయుక్త కార్యదర్శులు దేవరాజు, ఏ లక్ష్మయ్య, ఆర్గనై జింగ్ సెక్రెటరీలు బీ భూమయ్య, వీ రాజనర్సయ్య, ప్రచార కార్యదర్శి ఎస్ విశ్వజ్ఞాచారి, స్టేట్ కౌన్సిలర్స్ కే నరసింహరెడ్డి, మెకర్తి నారాయణను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సభ్యులకు ఎన్నికల అధికారి లింగన్న నియామక పత్రాలను అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గంను పూలమాలలతో విశ్రాంత ఉద్యోగులు అభినందించారు.

పీఆర్‌టీఎఫ్ మండల కార్యవర్గం

గంభీరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీఎఫ్ మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ముత్తయ్యగారి నాగరాజు, ప్రధానకార్యదర్శిగా చిట్టంపల్లి బాలకిషన్, ఉపాధ్యక్షులుగా సంధ్యారాణి, నజీనాబేగం,గుడికాడి కొమురయ్య, శనిగరం బాలరాజు, విశ్వనాథుల ప్రసాద్, జిల్లా కౌన్సిలర్లుగా బోయన్నగారి నారాయణ, భానోత్ వర్షున్, గంద్యాడపు శ్రీనివాస్, జిల్లెల్ల శ్రీనివాస్‌గౌడ్, శనిగరం రామచంద్రంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

గంభీరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్ గురువారం సందర్శించారు. పాఠశాలలో రికార్డులను, ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళిక డైరీలు, మధ్యాహ్న భోజనం మెనూ నాణ్యత, పాఠశాల పరిసరాలు, సిబ్బంది పని తీరు తదితర అంశాలపై ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు, సిబ్బందికి తగిన సూచనలు అందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆదేశించారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



సిరిసిల్ల కోర్టులో విధులను బహిష్కరించిన న్యాయవాదులు



వేములవాడలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని కోర్టులో వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న సమయంలో న్యాయవాదిపై దౌర్జన్యానికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల బార్ అసోషియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల కోర్టులో గురువారం బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు విదులను బహిష్కరించారు. న్యాయవాది అనిల్‌కుమార్‌పై సీఐ కృష్ణతోపాటు ఎస్ఐలు అనిల్‌కుమార్, అశోక్‌లు దౌర్జన్యానికి పాల్పడడంతోపాటు వాహనాన్ని తీవ్రంగా ధ్వంసం చేశారని వీరిపై చట్టపరంగాచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సజ్జనం అనిల్‌కుమార్, కార్యదర్శి తనుగుల వెంకటి న్యాయవాదులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయ వాదులు కోర్టు విధులు బహిష్కరించారు. అనంతరం కోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. నిర్మల్‌లో న్యాయవాదిపై దౌర్జన్యం చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమలగౌడ్, విద్యాసాగర్‌రావు, రేగుల దేవేందర్, పొత్తూరి అనిల్‌కుమార్, కొడిమ్యాల పురుషోత్తం, పిట్టల మనోహర్, కట్కం జనార్ధన్, గోపికృష్ణ, పెంట రాజు, పర్లపల్లి అంజయ్య, బొజ్జ మహేందర్, తమ్మిరి అన్నపూర్ణ, జక్కుల పద్మ, పడిగెల మమత, నాసరిలు పాల్గొన్నారు.